క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



రెంటచింతల: స్థానిక సుబ్బన్నతోట కాలనీలో వేంచేసిన అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం స్వామి వారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు ఓరుగంటి మారుతీశర్మ నేతృత్వంలో స్వామి వారికి ఉదయం 5.30 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వార్లకు పంచామృతాభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. దేవస్థానం అధ్యక్షుడు నాళం పెదబాబు, పాలకవర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధంగా ఉండాలి

వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరెడ్డి



పిడుగురాళ్ల: రైతులందరు ఖరీఫ్ సాగుకు సిద్ధమవ్వాలని ఏవో ఎన్.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరు ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉండాలని, రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ, ఉద్యాన సహాయకుల సహాయంతో మట్టి నమూనాలను సేకరించటం జరుగుతుందన్నారు. ఈ మట్టి నమూనాల కనుగుణంగా రైతులు పంటలను వేసుకోవాలని సూచించారు. అదే విధంగా రైతులు లోతుగా దుక్కులను దున్ని పచ్చిరొట్ట పంటలైన జీలుగ, జనుము, పిల్లిపెసర ముందుగానే వేసుకోవాలని సూచించారు. ఈ పచ్చి రొట్ట పంటలను భూమిలో కలియదున్నటం వలన ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. పంట మార్పిడి విధానం వల్ల అనేక లాభాలు ఉన్నందున రైతులందరూ కూడా తప్పనిసరిగా పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలు



సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో టెన్త్ విద్యార్థినికి గాయాలైన ఘటన సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం సమీపంలో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన టెన్త్ విద్యార్థిని అనురాధ రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్ష రాసేందుకు వెళ్లింది. పరీక్ష రాసి తిరిగి ఇంటికి వచ్చేందుకు రోడ్డుపై ఉన్న సమయంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో విద్యార్థినికి గాయాలయ్యాయి. హుటాహుటిన చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న అన్నదాతలు



నకరికల్లు: ఖరీఫ్ సీజన్ సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. వేసవి ముగుస్తుండడంతో పొలాలకు సేంద్రియ ఎరువులు చల్లే పనిలో నిమగ్నమయ్యారు. పశువుల పేడ ఎరువు పొలంలో చల్లుకొని అది బాగా మాగిన తరువాత కలియదున్నితే నేలకు పోషకాలు అంది పంట ఏపుగా పెరిగి చీడపీడలను తట్టుకునే శక్తి వస్తుంది. దీంతో పశువుల ద్వారా వచ్చే పేడ ఎరువు పొలాల్లో చల్లుకుంటున్నారు. ఎరువు లభ్యత తక్కువగా ఉన్న రైతులు ట్రక్కుల చొప్పున కొనుగోలు చేసి చల్లుకుంటున్నారు. క్వింటా ఎరువులో 0.5 నుంచి 1.5 శాతం నత్రజని, 0.3 నుంచి 0.9 శాతం భాస్వరం, 0.5 నుంచి 1.9 శాతం పొటాష్ ఉంటుంది. సేంద్రియ పదార్థం ద్వారా బరువు నేలలు గుల్లబారి వేరు ఏపుగా పెరగడం, నాణ్యమైన పంట ఉత్పత్తికి దోహదపడుతుంది. సేంద్రియ ఎరువులు సీజన్‌కు ముందు ఎకరాకు 5 నుంచి 6 టన్నుల చొప్పున చల్లుకుంటున్నారు.

పెరిగిన ఎరువు ధర

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ సమీపించడంతో పేడ ఎరువు ధర గతేడాది కంటే ఈ ఏడాది పెరిగింది. ఎరువు కొనుగోలు, కూలీలు, బాడుగ మొత్తం కలిపి ట్రక్కుకు రూ.2 వేల పైగా ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 5 నుంచి 6 టన్నుల ఎరువు అంటే మూడు ట్రక్కుల వరకు అవసరమవుతుందని అంటే ఎరువుకే రూ.6 వేల వరకు ఖర్చవుతుందని వాపోతున్నారు.

అల్లర్లపై మాక్ డ్రిల్

పిడుగురాళ్లలో కళ్లకు కట్టినట్లు చూపించిన పోలీసులు



అల్లర్లలో గాయపడిన ప్రజలను రక్షిస్తున్నట్లు నటిస్తున్న పోలీసులు



మాక్ డ్రిల్‌లో అల్లర్లు సృష్టిస్తున్నట్లు నటిస్తున్న పోలీసులు

పిడుగురాళ్ల: అల్లర్లకు పాల్పడితే ఎవరినైనా ఉపేక్షించేది లేదని పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ బీఆర్‌సీ రాజు అన్నారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో పోలీస్ మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా పోలీసులు ప్రజల ధరించే దుస్తులు ధరించి అల్లర్లు సృష్టిస్తున్నట్లు, పోలీసుల జులుం నశించాలంటూ నినాదాలు చేస్తూ అల్లర్లు, గొడవలు సృష్టిస్తున్నట్లు నటించారు. ఐలాండ్ సెంటర్‌లో రబ్బర్ టైర్లను తగులబెట్టి, ప్రజా రవాణాకు అంతరాయం కలిగించేలా, అల్లర్లు చేశారు. అలాగే అల్లరి మూకలను అడ్డుకునేందుకు పోలీసులు తీసుకునే యాక్షన్‌లపై కూడా మాక్ డ్రిల్‌లో పోలీసులు కళ్లకు కట్టినట్లు చూపించారు. అల్లరి మూకలను అడ్డుకునేందుకు ముందస్తుగా లాఠీచార్జి చేయటం, అల్లరిలో గాయపడిన వారిని అంబులెన్స్‌లో హాస్పిటల్‌కు తరలించటం, అల్లరి మూకలను అడ్డుకునేందుకు గాలిలో కాల్పులు జరపటం వంటి కార్యక్రమాలను పోలీసులు మాక్ డ్రిల్‌లో కళ్లకు కట్టినట్లుగా చూపించారు. మాక్ డ్రిల్ చూసిన పట్టణ ప్రజలు అల్లర్లు, గొడవలు జరిగితే ఇంతటి హింసాత్మకంగా ఉంటుందా అని.. పోలీసులు అల్లర్లను కట్టడి చేయటానికి ఇన్ని విధాలుగా కష్టపడాల్సి వస్తుందా అని చర్చించుకుంటున్నారు.

అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదు



మాట్లాడుతున్న పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ బీఆర్‌సీ రాజు, పక్కన సీఐ, ఎస్‌ఐలు

పిడుగురాళ్లలో మాక్ డ్రిల్ కార్యక్రమానికి హాజరైన పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ బీఆర్‌సీ రాజు మాట్లాడుతూ... మే 13వ తేదీన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అయినప్పటికీ ఎన్నికలు పూర్తి అయిన తర్వాత పల్నాడు జిల్లాలో పలు ప్రాంతాల్లో గొడవలు, అల్లర్లు జరిగాయి. వాటిని కట్టడి చేసే కార్యక్రమం చేపట్టాం. వందల సంఖ్యలో అరెస్టు చేసి రాజమండ్రి, నెల్లూరు జిల్లాల్లో ఉన్న సెంట్రల్ జైళ్లలకు పంపించటం జరిగిందన్నారు. మిగిలిన వారిని కూడా త్వరలోనే అదుపులోకి తీసుకుంటామన్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని పిడుగురాళ్ల పట్టణంలో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ కార్యక్రమం జరుగుతుందని, ఎన్నికల కౌంటింగ్ సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఆ సమయంలో ప్రజలు ఎవరు ఇళ్లల్లో నుంచి బయటకు రావద్దని, గుంపులు, గుంపులుగా రోడ్లపై సంచరించకూడదని, గెలుపు ఓటములు సహజం, గెలిచిన వారు సంబరాలు చేసుకోవటం, బాణసంచా కాల్చడం వంటివి నిషేధించటం జరిగిందని తెలిపారు. ప్రజలందరు పోలీసు వారి హెచ్చరికలను అనుసరించి సహకరించాలని సూచించారు. లేనిపక్షంలో వారి జీవితాలు జైలుపాలు అవుతారన్నారు. చదువుకునే విద్యార్థులు అల్లర్లు, గొడవల్లో పాల్గొంటే వారిపై పోలీస్ కేసులు నమోదయితే అటువంటి వారికి ప్రభుత్వ ఉద్యోగాలు రావని హెచ్చరించారు. అలాగే ప్రజలు పోలీస్ వారి సూచనలు పాటించి ఓట్ల లెక్కింపు రోజున ప్రశాంతమైన వాతావరణంలో జీవించాలని సూచించారు. ప్రత్యేక బలగాలు పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఆయన వెంట పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు, ఎస్‌ఐ పఠాన్ రబ్బానీ ఖాన్, పోలీస్ సిబ్బంది, ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

ఆశాజనకంగా పత్తి సాగు



కారెంపూడిలో సాగులో ఉన్న పత్తి పైరు

కారెంపూడి: మండలంలో వేసవిలో వేసిన పత్తి పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. తుఫాన్ ప్రభావం వల్ల కురిసిన వర్షాలు పంటకు మరింత మేలు చేశాయి. దీంతో పైర్లు కళకళలాడుతున్నాయి. దానికి తోడు రోహిణి కార్తెలో ఎండలు కూడా తక్కువగా ఉండడం కూడా పైర్ల ఎదుగుదలకు కలసి వచ్చింది. చాలా కాలంగా ఖరీఫ్‌కు ముందస్తుగా వేసవిలో పత్తి సాగు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రియల్, మే నెలల్లో విత్తిన పత్తి పైర్లు దాదాపు కాపు దశకు చేరుకున్నాయి. గూడ, పూత దశలో ఉన్నాయి. మరో వారం పది రోజుల్లో పైర్లు అన్నీ దాదాపు పూర్తి స్థాయి కాపు దశకు వస్తాయి. ఇప్పటికే పైర్లు వేసి 45 రోజులు దాటినవి గూడ దశలో ఉన్నాయి. ఇంకా ముందస్తుగా వేసినవి గూడ, పూత దశకు చేరుకున్నాయి. మండలంలో బోర్లున్న రైతులు వేసవిలో ముందస్తుగా ఏప్రియల్, మే నెలల్లో పత్తి విత్తనాలు నాటారు. వేసవిలో గులాబి రంగు పురుగు బెడద తక్కువగా ఉండడం చీడపీడలు కూడా తక్కువగా వస్తాయని వేసవిలో పత్తి సాగు చేస్తున్నారు. బీటీ పత్తి విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చిన దగ్గర నుంచి వేసవిలో పత్తి సాగు చేస్తున్నారు. పత్తి పంట అయిన తర్వాత ఆ పొలాల్లో రెండవ పంటగా మిర్చి, కంది లాంటి పైర్లు వేసుకోడానికి కాలం అదను కలసి వస్తుండడంతో వేసవి పత్తి సాగు జోరుగా చేపట్టారు. కారెంపూడి మండలంలో సుమారు 2,200 ఎకరాలలో ప్రస్తుతం పత్తి సాగులో ఉంది.

రేపటి నుంచి హనుమజ్జయంతి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో భక్తాంజనేయ స్వామి

సత్తెనపల్లి: పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో వేంచేసి ఉన్న భక్తాంజనేయ స్వామి వారి దేవస్థానంలో ఈనెల 31 నుంచి జూన్ 2 వరకు మూడు రోజుల పాటు హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈ నెల 31న ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, తోరణ అలంకరణ, 7 గంటలకు ప్రాతఃకాలార్చన, 8 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన, మండపారాధన, నవకలశ ఆరాధన, 9 గంటలకు పంచామృత స్నపన, 10 గంటలకు హనుమత్ హోమము, 11 గంటలకు రజత కవచ, పుష్పాలంకరణ, సహస్ర నాగవల్లీదళార్చన, 12 గంటలకు నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ గోష్ఠి, సాయంత్రం 5 గంటలకు హనుమత్ బోనాలు, నగరోత్సవం జరుగుతాయన్నారు. జూన్ 1న ఉదయం 7 గంటలకు ప్రాతఃకాలార్చన, విశేష పుష్పాలంకరణ, 8 గంటలకు వార్షిక చూత ఫలార్చన, 9:30 గంటలకు సహస్ర మామిడి ఫల విశేషార్చన, సామూహిక గంధ సింధూరార్చన, సాయంత్రం 5 గంటల నుంచి 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ, రాత్రి 7 గంటల నుంచి అష్టోత్తర శత నామ పూజలు జరుగుతాయన్నారు. జూన్ 2న ఉదయం 7 గంటలకు ప్రాతఃకాలార్చన, 9 గంటలకు విశేష పుష్పార్చన, రాత్రి 7 గంటలకు పూలంగి సేవ, అనంతరం కొలారు రంజిత్ కుమార్ ఆర్కెస్ట్రా వారిచే భక్త సంగీత కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలు ఆలయ అర్చక స్వామి శ్రీమాన్ వేదాంతం విజయనరసింహాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నైపుణ్యమే ఉపాధి



మాట్లాడుతున్న హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షుడు బుల్లిబాబు

సత్తెనపల్లి: విద్యార్థి దశలో ప్రతి అవకాశాన్ని, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ నేర్చుకునే పనిపై శ్రద్ధ పెట్టి నేర్చుకున్నట్లయితే ఆ నేర్చుకున్న నైపుణ్యమే భవిష్యత్తులో మనకి భరోసానిస్తుందని, ఆ నైపుణ్యమే మన జీవితంలో మనకి ఉపాధినిస్తుందని హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఉచిత శిక్షణ, ఉపాధి సెంటర్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్‌లో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాలు భవిష్యత్తు అవకాశాలు అనే అంశంపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సెంటర్ ఇన్‌చార్జ్ రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ సభ్యుడు సుభాని మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవిస్తూ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. బాలికలు, మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం సంపాదించినప్పుడు సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. స్కిల్ హబ్ ఇన్‌చార్జ్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిసర ప్రాంత పదవ తరగతి ఆపై చదువుకున్న 18–40 సంవత్సరముల వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు ట్రైనింగ్ సెంటర్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రైనింగ్ టీచర్ షేక్ మీరాబి, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

నార్నెపాడులో ఫ్యామిలీ డాక్టర్



నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో వైద్యులు నజీర్ పాల్గొని 98 మందికి వైద్య సేవలందించారు. 32 మందికి సాధారణ పరీక్షలు, 34 మందికి బీపీ, 26 మందికి షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించినట్లు నజీర్ తెలిపారు. వీరితో పాటు గర్భిణులు, బాలింతలకు అవసరమైన వ్యాక్సిన్‌లు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శివపార్వతి, ఎంపీహెచ్ఏ జ్యోతి, డీఈవో కె.రవితేజ, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 122 మంది గైర్హాజరు

సత్తెనపల్లి: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు బుధవారం 122 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రగతి జూనియర్ కళాశాల, కృష్ణవేణి జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 557 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 478 మంది హాజరయ్యారు. 79 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే ఫిజిక్స్, ఎకానామిక్స్ పరీక్షలకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 266 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 223 మంది హాజరయ్యారు. 43 మంది గైర్హాజరైనట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ శైలజాకుమారి తెలిపారు.

ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి



సత్తెనపల్లి: ప్రమాదవశాత్తూ పొలం దున్నుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళ గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రెంటపాళ్ళ గ్రామానికి చెందిన ఇస్తల రోశయ్య (40) ట్రాక్టర్‌తో గ్రామానికి చెందిన కారుమంచి రామకోటయ్య పొలం దున్నేందుకు వెళ్లాడు. పొలం దున్నుతుండగా ట్రాక్టర్ ఇంజన్‌కు ఉన్న హైడ్రాలిక్ పలిటి నాగలికి బిగించి ఉన్న లిఫ్ట్ వైర్లు సరిచేయడానికి హైడ్రాలిక్ ఇనుప నాగలి రన్నింగ్‌లో ఉండగానే రోశయ్య నిర్లక్ష్యంగా డ్రైవర్ సీటు కింద నుంచి దూరి వైర్లు సరి చేస్తుండగా ప్రమాదవశాత్తూ హైడ్రాలిక్ ఇనుప నాగలి, డ్రైవర్ సీటుకు మధ్య రోశయ్య ఇరుక్కుపోయి గుండెకు హైడ్రాలిక్ ఇనుప నాగలి ఒత్తుకొని పోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. మృతదేహన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య ఇస్తల బుజ్జి ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ సీఐ మల్లి రాజేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకు ఖాతాలకే పింఛన్ నగదు

నకరికల్లు: జూన్ నెల 1వ తేదీన కూడా పింఛన్‌లను ఆయా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనున్నట్లు ఎంపీడీవో డి.జయమణి బుధవారం తెలిపారు. ఇళ్లకే పరిమితమై బ్యాంకులకు వెళ్లలేని వారికి సచివాలయ సిబ్బంది ఇళ్లకు వెళ్లి పింఛన్ ఇస్తారని అన్నారు. పింఛన్‌దారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయిన పింఛన్ నగదును అదే రోజు నుంచి తీసుకోవచ్చన్నారు.

ర్యాలీలు, ఊరేగింపులు చేయవద్దు

సీఐ సురేంద్రబాబు



దాచేపల్లి : ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తరువాత రాజకీయ పార్టీల నాయకులు పార్టీ జెండాలతో, డీజేలతో ర్యాలీలు, ఊరేగింపులు చేసేందుకు అనుమతులు లేవని దాచేపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ.సురేంద్రబాబు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం ప్రకటిస్తుందని, ఫలితాలు ఏ పార్టీకి అనుకూలంగా, వ్యతిరేకంగా వచ్చినా ఎటువంటి సంబరాలు చేయవద్దన్నారు. ఫలితాలకు కొన్ని రోజుల ముందుగానే టపాసులు, గులాములు విక్రయించవద్దని సంబంధిత యజమానులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామని, ఎన్నికల నిబంధనలు ఎవరు అతిక్రమించిన చర్యలు తీసుకుంటామని సీఐ సురేంద్రబాబు హెచ్చరించారు. ఎన్నికల ఫలితాలకు ముందుగానే లాడ్జిలు, గెస్ట్‌హౌస్‌లలో కొత్తవారిని అనుమతించవద్దని, కొత్తవారిని అనుమతిస్తే సంబంధిత లాడ్జిలు, గెస్ట్‌హౌస్‌లపై చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

దుక్కులకు అనుకూల సమయం

- అకాల వర్షాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి




రెంటచింతల: సాగు భూములలో దుక్కులు దున్నుకునేందుకు ఇదే అనుకూలమైన సమయమని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి కాలంలో కురిసే అకాల వర్షాలను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దుక్కులను వాలుగా లోతుగా దున్నుకోవాలని లేని ఎడల వర్షపు నీటికి భూమి కోతకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వాలుకు అడ్డంగా దున్నిన వ్యవసాయ భూమి ఎక్కువ తేమను కలిగే సామర్థ్యం ఉంటుందన్నారు. లోతుగా దుక్కులు దున్నిన భూమిలో పంట మొక్కల వేర్లు లోతుగా పాదుకుని వెళ్లడం వలన పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. పొలాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంటలను సాగుచేయడం వలన చీడపీడలు భూమిలో ఉంటాయని వేసవిలో దుక్కులు దున్నడం వలన భూములలో ఉండే క్రిమి కీటకాలతోపాటు చీడపీడలు ఎండలకు చనిపోతాయన్నారు. వేసవిలో దుక్కి దున్నుకోవడం వలన అయ్యే ఖర్చు కన్నా దాని ద్వారా రైతుకు చేకూరే ప్రయోజనమే ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

సంతాన సుబ్రహ్మణ్యేశ్వరునికి అష్టోత్తర శత కలశాభిషేకం



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



అష్టోత్తర శత కలశాభిషేకాలు చేస్తున్న దృశ్యం

పిడుగురాళ్ల: పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంలో స్వామి వారికి షష్ఠి పురస్కరించుకొని అష్టోత్తర శత కలశాభిషేకం, స్వామి వారికి భస్మముతో విశేషాలంకారం నిర్వహించారు. అనంతరం సహస్ర నామార్చన 108 మామిడి పండ్లతో పూజా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ పూజారి, ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షులు గుదే నాగ సతీష్, దేవాలయ అర్చకులు గుంటుపల్లి వెంకటేశ్వర శర్మ తదితరులు ఉన్నారు.

శివాజీ మహరాజ్ జననం శివనేరి దుర్గం పుస్తకావిష్కరణ



సత్తెనపల్లి: పట్టణంలోని 25వ వార్డు మహారాష్ట్ర వీధిలో జూన్ 9న హైందవ సామ్రాజ్య వ్యవస్థాపకుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతం చేయాలని గుంటూరు జిల్లా ఆర్య క్షత్రియ ఆరే మరాఠా సంఘ అధ్యక్షుడు సింధు లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలో బుధవారం శివాజీ మహరాజ్ జననం శివనేరి దుర్గం అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పులహరి భానుజీ మాట్లాడుతూ జూన్ 9న జరిగే శివాజీ మహరాజ్ విగ్రహావిష్కరణకు వివిధ జిల్లాల్లో ఉన్న ఆర్య క్షత్రియ ఆరే మరాఠా సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నర్సోజీ, పి.గోవిందు, రామసాయి, విశ్వనాథ ప్రభు, కరుణాకర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలలో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు

అచ్చంపేట: మండలంలోని అన్ని గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాలలో 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర అందుబాటులో ఉంచిన్నట్లు వ్యవసాయాధికారి పి.వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎకరాకు 10కిలోల చొప్పున 50శాతం స బ్సిడీపై ఇవ్వడం జరుగుతుందన్నారు. జీలుగ, జనుము విత్తనాలు 10 కిలోల ప్యాకెట్ అసలు ధర రూ.880 కాగా సబ్సిడీపై రూ.440కు ఇవ్వడం జరుగుతుందన్నారు. పిల్లిపెసర ఎకరాకు 8 కిలోలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం తొలకరి వర్షాలు పడుతున్నందున రైతులు తమ భూములలో పచ్చిరొట్ట విత్తనాలు వేసి రెండు అడుగులు ఎత్తు పెరగగానే రోటవేటర్‌ద్వారా భూమిలో కలయదున్నాలని చెప్పారు. అలా చేయడంవల్ల అధిక దిగుబడులు సాధ్యపడతాయని చెప్పారు. విత్తనాలు కావలసిన రై తులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం నకలుతోపాటు ఓటీపీ చూసుకునేందుకు ఫోను వెంట తెచ్చుకోవాలన్నారు. పూర్తి వివరాలకు రైతు భరో సా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా ఏవో కోరారు.

సాహస క్రీడా శిక్షణ కేంద్రంగా కొండవీడు

ఎన్‌సీసీ డీడీజీ మధుసూదన రెడ్డి



ఎన్‌సీసీ అధికారి మధుసూదన రెడ్డి

యడ్లపాడు: కొండవీడు సుందర అద్భుత ప్రదేశం మాత్రమే కాదు... సాహస క్రీడలకు ఎంతో అనువైన ప్రాంతమని ఎన్‌సీసీ ఏపీ, తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ జనరల్(డీడీజీ) ఎయిర్ కమాండర్ వి.మధుసూదన రెడ్డి పేర్కొన్నారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు కోట ప్రాంతాన్ని బుధవారం ఆయన సందర్శించారు. గుంటూరు నేషనల్ క్యాడెట్ కోర్సు(ఎన్‌సీసీ) బృందంతో విచ్చేసిన ఆయన కొండవీడు కోట కొండలపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం, యోగి వేమన మండపం, అనవేమారెడ్డి విగ్రహం, చారిత్రక అంశాలను తెలిపే గ్యాలరీ, పుట్టాలమ్మ, ముత్యాలమ్మ, వెదుళ్ల చెరువుల్ని తిలకించారు. సంస్కృతి–సంప్రదాయం, చారిత్రక అంశాలు, కొండవీడు పాలన వైభవాల గురించి కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కె.శివారెడ్డి ఆయనకు వివరించారు. అనంతరం ఔట్ రైవల్ ట్రెక్కింగ్ అకాడమీ దలవాయి ఆషా ఆధ్వర్యంలో ఎత్తైన శిఖరం నుంచి 140 అడుగుల రాప్లింగ్ నిర్వహించారు. వెదుళ్ల చెరువులో కయాకింగ్‌పై బోటింగ్ క్రీడను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎన్‌సీసీ క్యాడెట్లకు ఇచ్చే కంబైండ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపు సాహస క్రీడలను ఇకపై కొండవీడు కోటలో నిర్వహించేలా చూస్తామన్నారు. నగరవనం పేరిట అటవీ శాఖ ఆధ్వర్యంలో సంరక్షిస్తున్న పచ్చదనం బాగుందన్నారు. అలాగే శిఖరాల్లో సాహస క్రీడలు, కృత్యాలు, అలాగే వెదుళ్ల చెరువులో జలక్రీడల నిర్వహణకు ఎంతో అనువుగా ఉంటుందన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు శాశ్వతంగా ఇక్కడే సాహస అంశాలపై శిక్షణ ఇచ్చేలా ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. జూన్‌లో మరోసారి పర్యటించనున్నట్లు చెప్పారు. పరిపాలన తనిఖీల్లో భాగంగా గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్‌ను సందర్శించినట్లు పేర్కొన్నారు.

వైభవంగా పోలేరమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: నాదెండ్ల శివారు గ్రామమైన జాష్టివారి పాలెంలో కొలువైయున్న పోలేరమ్మ తల్లి ఆలయ ఐదో వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. సుమారు 150 ఏళ్ల క్రితం ఈ గ్రామంలో పెద్దలు ఆలయం నిర్మించారు. పురాతన ఆలయం జీర్ణావస్థకు చేరుకోవటంతో 2019లో ఆలయాన్ని పునర్ని ర్మించారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ అనంతరం కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. పూజారి మేకల నాగరాజు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యలగాల వెంకటేశ్వర్లు, దామనబోయిన సాంబశివ రావు, మార్త నారాయణబాబు, యలగాల నాగేశ్వరరావు, అంగిరేకుల శ్రీనివాస రావు, మార్త శ్రీనివాసరావు, యలగాల అప్పారావు ఉన్నారు.